మామిడికి మంచు దెబ్బ





పద్మనాభంలో మంచుకు మాడిపోయిన మామిడి పూత

- 15 రోజులుగా కురుస్తున్న తేనె మంచు
- మామిడి రైతుల్లో ఆందోళన
- తోటలు కొనుగోలు చేసిన వ్యాపారుల్లో కలవరం

పద్మనాభం: మామిడిని మంచు దెబ్బ తీస్తోంది. పద్మనాభం మండలంలో 15 రోజుల నుంచి తేనె మంచు దట్టంగా పడుతోంది. ఈ మంచు మామిడి తోటలను ఆవరిస్తోంది. దీంతో మామిడి పూత మాడిపోయి, నేల రాలుతోంది. డిసెంబర్ నెలలో కురిసిన వర్షాలకు కొంత మామిడి పూత రాలిపోయింది. దీనికి తోడు ఇప్పుడు తేనె మంచు కురుస్తుండడంతో పూత రాలి నేల పాలవుతోంది. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి, సస్య రక్షణ చర్యలు చేపట్టిన రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్షలాది రూపాయలు పెట్టి మామిడి తోటలు కొనుగోలు చేసిన వ్యాపారులు లబోదిబో మంటున్నారు.

పూత నిలబెట్టుకునేందుకు ఆపసోపాలు

15 రోజుల నుంచి కురుస్తున్న తేనె మంచుకు ఉన్న పూత మాడిపోయి నల్లగా మారి నేల పాలవుతోంది. మంచు వల్ల బంగినపల్లి, కలెక్టర్, పరియాలు పూతకు రావడం లేదు. ఇప్పటికే రైతులు రెండు సార్లు మందులు పిచికారీ చేశారు. తెగుళ్లు రాకుండా, ఉన్న పూత నిలబడడానికి బావిస్టన్ వంటి మందులు రెండు సార్లు పిచికారీ చేశారు. నవంబర్, డిసెంబర్ నెలలో ఈ మందులు పిచికారీ చేశారు. ఒకసారి సస్య రక్షణ చర్యలు చేపట్టడానికి ఎకరాకు రూ.7వేలు వెచ్చించారు. ఉన్న పూతను నిలబెట్టుకోవడానికి రైతన్నలు, వ్యాపారులు ఆపసోపాలు పడుతున్నారు. మూడో సారి తోటలకు మందులు పిచికారీ చేస్తున్నారు. ఇప్పటికీ తేనె మంచు కురుస్తుండడంతో ఉన్న పూత కూడా నిలబడుతుందో లేదో అని మామిడి రైతులు, వ్యాపారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.



కృష్ణాపురంలో మామిడి తోటను ఆవరించిన మంచు

నాడు అకాలవర్షం.. నేడు మంచు

మండలంలో 3,767 ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. అనంతవరం, గంధవరం, పెంట, బాందేవుపురం, మద్ది, కృష్ణాపురం, పద్మనాభం, చేరిఖండం, రెడ్డిపల్లి, నరసాపురం, రెడ్డిపల్లి, భద్రయ్యపేట, పాండ్రంగి గ్రామాల్లో ఈ తోటలు ఉన్నాయి. ముందుగా సువర్ణ రేఖ, పణుకులు డిసెంబర్ నెలలో పూతకు వచ్చాయి. మిగతా రకాలైన బంగినపల్లి, కలెక్టర్, పరియాలు ఇప్పుడు పూత దశలో ఉన్నాయి. డిసెంబర్ నెలలో 13 రోజులు కురిసిన వర్షాలకు ముందు పూతకు వచ్చిన సువర్ణరేఖ, పణుకుల్లో 40 శాతం పూత రాలిపోయింది. డిసెంబర్ నెలలో 6.7 మిల్లీ మీటర్లు సాధారణ వర్షపాతం కాగా, 164.6 మిల్లీ మీటర్లు వర్షపాతం కురిసింది. పూతతో ఉన్న సమయంలో, పూతకు వచ్చే దశలో వర్షం కురవకూడదు. ఈ సమయంలో అత్యధికంగా వర్షం కురవడంతో పూత మాడిపోయి నాశనమై రాలిపోయింది.



కురపల్లిలో మామిడి చెట్లను ఆవరించిన మంచు



శేరిఖండంలో పూత నిలబడటానికి మామిడి చెట్లకు మందు పిచికారీ చేస్తున్న రైతు

పూత రాలిపోతోంది



నేను శేరిఖండం గ్రామాల్లో 25 ఎకరాల మామిడి తోటను రైతుల నుంచి ఫలసాయానికి కొనుగోలు చేశాను. రూ.1.50లక్షలకు ఈ తోటలు కొన్నాను. రూ1.57 లక్షలతో మందులు కొనుగోలు చేసి సస్య రక్షణ చర్యలు చేపట్టాను. మంచు కురుస్తుండడంతో సువర్ణరేఖ, పనుకులు రకాలు పూత నల్లగా మాడిపోయి నేల పాలవుతున్నాయి. వాతావరణం ఇలాగే కొనసాగితే మాకు పెట్టుబడి కూడా రాదు.

– ఎస్.ఆదియ్య, వ్యాపారి, శేరిఖండం

రూ.1.50లక్షలు పెట్టుబడి పెట్టా



నాకు 24 ఎకరాల మామిడి తోట ఉంది. ఈ మామిడి తోటలకు ఇప్పటికి రెండు సార్లు మందులు పిచికారీ చేశాను, రూ.1.50లక్షల పెట్టుబడి పెట్టాను, డిసెంబర్ నెలలో కురిసిన వర్షాలకు మామిడి పూత మాడి పోయి అధికంగా నేలపాలైంది. సువర్ణరేఖ, పనుకులు పూత రాలి పోయింది. మిగతా రకాలు బంగినపల్లి, కలెక్టర్, పరియాలు ఆలస్యంగా పూత పూస్తాయి. మంచు వల్ల ఇవి పూత రాని పరిస్థితి నెలకొంది.

– వి.గురునాథ్, రైతు, రెడ్డిపల్లి

ఒత్తిడిని జయిస్తేనే విజయం



అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

తగరపువలస: విద్యార్థులు ఒత్తిడిని జయిస్తే విజయం సొంతమవుతుందని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ తిరుమల రావు అన్నారు. పిల్లలు ఒత్తిడికి గురి కాకుండా తల్లిదండ్రులు తమ పాత్ర పోషించాలన్నారు. పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఏకాగ్రతతో పాటు సరైన కౌన్సెలింగ్ అవసరమని పేర్కొన్నారు. తాళ్లవలసలోని తిరుమల విద్యాసంస్థ ప్రాంగణంలో జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, నీట్ పరీక్షల గురించి శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పిల్లలు అన్ని రంగాల్లో ప్రగతిని సాధించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. అతి ప్రేమతో పిల్లల సామర్థ్యాన్ని పాడు చేయకూడదన్నారు. చదువుతో పాటు జీవించగలిగే నైపుణ్యాన్ని పెంపొందించుకునేలా వారిని తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె.ఎస్.వి.వి.సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ, ఇ.మృత్యుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్-స్వచ్ఛ విశాఖ'

విశాఖ సిటీ: స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో ప్రతి నెల 3వ శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్-స్వచ్ఛ విశాఖ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం(18వ తేదీ) ఉదయం 10 గంటలకు సెంట్రల్ పార్క్ వద్ద, అనంతరం 11.30 గంటలకు వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో ప్రతిజ్ఞ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి సామాజిక బాధ్యతగా తన పరిసరాలతో పాటు కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనవసరమైన కాగితాలను తొలగించాలని తెలిపారు. సంస్థ నిర్వహణలో ఉన్న అన్ని పార్క్‌లలో చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని, అదేవిధంగా వీఎంఆర్‌డీఏ పరిధిలోని వాణిజ్య సముదాయాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని శత శాతం నిషేధించాలని ఆదేశించారు. తప్పని సరిగా వస్త్ర లేదా కాగితపు సంచులను మాత్రమే ఉపయోగించాలన్నారు. విధిగా పొడి చెత్త, తడి చెత్తలకే వేర్వేరుగా చెత్త బుట్టలను వినియోగించాలని సూచించారు.

క్లుప్తంగా

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలను తీసుకుని వస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలను వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రాన్ని, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకుని వెళ్లారు. అభిషేకాల అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు.

చంద్రంపాలెం హైస్కూల్లో నవోదయ పరీక్ష కేంద్రాలు

మధురవాడ: నవోదయలో 6వ తరగతి ప్రవేశాల కోసం ఈ నెల 18న నిర్వహించనున్న పరీక్షలకు చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవి తెలిపారు. ఇందుకోసం ఏర్పాట్లు అన్నీ పూర్తి చేసినట్టు చెప్పారు. ఇందులో ఒక కేంద్రానికి తాను, రెండో కేంద్రానికి పాఠశాల ఉపాధ్యాయుడు స్వామి ఇన్‌చార్జిగా ఉంటున్నట్టు తెలిపారు. రెండు కేంద్రాల్లో 500మంది పరీక్ష రాయనున్నట్లు తెలియజేశారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌పై కస్తూర్బా విద్యార్థులకు శిక్షణ



వేములవలసలోని ఓ బేకరీలో విద్యార్థులు

మధురవాడ: ఆనందపురం మండలం నేల్తేరు గ్రామంలోని కస్తూర్బా కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం ఫుడ్ ప్రాసెసింగ్‌పై శిక్షణ ఇచ్చారు. వీరి ఇంటర్న్‌షిప్‌లో భాగంగా ఒకేషనల్ కోర్స్ ట్రైనీ ఖలేషా బేగం, ప్రిన్సిపాల్ లావణ్య ఆధ్వర్యంలో వేములవలస జంక్షన్‌లోని బాలాజీ స్వీట్స్ అండ్ బేకరీ ఫుడ్ ప్రాసెస్ యూనిట్‌కు తీసుకువెళ్లారు. అక్కడ బ్రెడ్స్, కేక్, కుకీస్, పేస్ట్రీ మేకింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వృత్తి విద్య ఫుడ్ ప్రాసెసింగ్ ఉపాధ్యాయిని స్వరాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ డ్రైడే పాటించాలి



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కొమ్మాది: ప్రతి ఒక్కరు ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ ఎస్.సూరిబాబు కోరారు. జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడ సచివాలయం సమీపంలో డ్రైడే–ఫ్రైడే కార్యక్రమం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, తడి చెత్త పొడిచెత్త వేరువేరుగా నిల్వ చేసుకోవాలన్నారు. చలి కాలం కావడంతో దోమల ఉత్పత్తి అధికంగా ఉంటుందని, వీటి వలన విష జ్వరాలు ప్రబలే అవకాశాలు ఉన్నందున ప్రజలు తమ పరిసర ప్రాంతాలను పొడిగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న ఎనిమిది మంది అరెస్ట్

పద్మనాభం: మండలంలోని ఐనాడలో శుక్రవారం పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పట్టుకుని అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీధర్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.12,650 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

ఆదర్శ నేత జ్యోతిబసు



జ్యోతిబసు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

మధురవాడ: తుది శ్వాస వరకు ప్రజల శ్రేయస్సు కోసమే ఆలోచించిన ఆదర్శనేత జ్యోతిబసు అని మధురవాడ ప్రాంత సీపీఎం నాయకులు కొనియాడారు. జ్యోతిబసు 14వ వర్ధంతి సందర్భంగా కొమ్మాది జంక్షన్ వద్ద గల సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సంస్మరణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యునిగా ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు సియాద్రి పైడితల్లి, జిల్లా నాయకుడు డి.అప్పలరాజు మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి పెద్ద ఉద్యోగాలు, పదవుల కోసం పాకులాడకుండా సామాన్యుల కోసం, కార్మిక హక్కుల కోసం అలుపెరగని పోరాటాలు చేసి, అనేక నిర్బంధాలు అనుభవించారన్నారు. ప్రపంచ స్థాయికి ఎదిగిన గొప్ప కమ్యూనిస్ట్ నాయకుడని శ్లాఘించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వాండ్రాసి సంధ్య, కె.కొండమ్మ, టి.రమేష్, సీహెచ్ శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

పుష్ప సోయగం



శ్రీవారి మెట్ల మార్గంపై ఆకర్షిస్తున్న పుష్పాలు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మెట్ల మార్గంలో పుష్పసోయగం చూపరులను ఆకట్టుకుంటోంది. ఇక్కడ ఏర్పాటు చేసిన వివిధ వర్ణాల పుష్పాలు భక్తుల మనసులను దోచుకుంటున్నాయి. శ్రీవారిని దర్శించుకునేందుకు వచ్చేవారు పుష్పాల చెంత ఫొటోలు తీసుకుంటూ సంబరపడుతున్నారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతుల పంపిణీ



పాలవలసలో విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

తగరపువలస: ఆనందపురం మండలం పాలవలసలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు శుక్రవారం ట్రోఫీ, బహుమతులు అందజేశారు. టోర్నీ విజేతగా చందక శ్రీను టీమ్ నిలిచింది. ద్వితీయ స్థానంలో పాలవలస సురేష్ టీమ్, తృతీయ స్థానంలో బి.సురేష్ టీమ్ నిలిచాయి. వారికి బి.శ్రీను నగదు బహుమతులు అందజేశారు. బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్ మన్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచిన వారికి ఏఎంసీ డైరెక్టర్ రొంతు శ్రీను ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పాలవలస అచ్చియ్యమ్మ, బి.ఎస్.నాయుడు, బూర్లె వెంకటేష్, రాజు, సాయి పాల్గొన్నారు.

ఐనాడలో..

పద్మనాభం: మండలంలోని ఐనాడలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు కురిమిన అనిల్ శుక్రవారం ట్రోఫీలు, నగదు బహుమతులు పంపిణీ చేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన ఒరిజినల్ గ్యాంగ్‌స్టార్స్ టీమ్‌కు రూ.10వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన రైజింగ్ గ్యాంగ్ స్టార్ టీమ్‌కు రూ.5వేలు నగదు బహుమతి అందజేశారు.

రహదారి గోతులమయం



అవనాపు వారి కళ్లాల వద్ద గోతులు పడిన రోడ్డు



ఎస్సీ కాలనీ వద్ద గోతులు పడిన రోడ్డు

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురం రోడ్డు గోతులు పడటంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. పద్మనాభం జంక్షన్ నుంచి కిలో మీటరున్నర నిడివి గల ఈ రోడ్డు ఎస్సీ కాలనీ, అవనాపు వారి కళ్లాలు, పరదేశమ్మ ఆలయం వద్ద గోతులు పడింది. ఈ మార్గంలో ఇటుక బట్టీల లారీలు పగలు, రాత్రుళ్లు నిర్విరామంగా తిరుగుతూ ఉండడంతో గోతులు రోజు రోజుకూ మరింత పెద్దవవుతున్నాయి. రాత్రి వేళల్లో మార్గం కనిపించక అవనాపు వారి కళ్లాల వద్ద గోతుల్లో పడి ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల పాలవుతున్నారు. వర్షాల సమయంలో వర్షపు నీటితో గోతులు నిండిపోవడంతో రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి, గోతులను పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పాలిథిన్ వస్తువులు స్వాధీనం

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డులో శానిటరీ సిబ్బంది సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం శానిటరీ సిబ్బంది, పలు సచివాలయాల సిబ్బంది విశాలాక్షినగర్‌లోని పాన్ షాపులు, టిఫిన్ సెంటర్లు తనిఖీ చేశారు.

పలు షాపుల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు సంబంధించిన కవర్లు, పేపరు కప్పులు, పేపరు ప్లేట్లు స్వాధీనం చేసుకొన్నారు. యజమాన్లకు జరిమానా విధించనున్నట్లు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీరావు తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు జరుగుతుందన్నారు. తనిఖీల్లో సచివాలయాల సిబ్బంది, శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై వాహనాల పార్కింగ్

- సర్వీస్ రోడ్డు అంతా ఇదే పరిస్థితి
- పట్టించుకోని పోలీసు, జీవీఎంసీ అధికారులు



మధురవాడ అప్ బ్రిడ్జి వద్ద ఫుట్‌పాత్‌పై పార్క్ చేసిన వాహనాలు



వుడా కాలనీ-కార్‌షెడ్ ఫుట్‌పాత్‌పై పార్క్ చేసిన వాహనాలు

మధురవాడ: ఫుట్‌పాత్‌లు వాహనాల పార్కింగ్ ప్రదేశాలుగా మారిపోయాయి. మధురవాడ హైవే సర్వీస్ రోడ్డు అంతటా ఇదే పరిస్థితి నెలకొంది. ఫుట్‌పాత్‌పై ద్విచక్ర వాహనాలతో పాటు, కొన్ని చోట్ల 4చక్రాల వాహనాలు కూడా పార్క్ చేసేస్తున్నారు. ఫుట్‌పాత్ అంతా ఇలానే వాడుకుంటూ పాదచారులను రోడ్డుపైకి నెడుతున్నారు. కొందరు వ్యాపారుల నిర్వాకం వల్లనే ఈ పరిస్థితి తలెత్తుతోందని పలువురు విమర్శిస్తున్నారు.

కార్‌షెడ్ నుంచి కొమ్మాది జంక్షన్ వరకు సర్వీసు రోడ్డును ఆనుకుని ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లపై వాహనాలు పార్క్ చేసేస్తున్నారు. ముఖ్యంగా కార్‌షెడ్, మిథిలాపురి వుడా కాలనీ జంక్షన్, దుర్గానగర్, చంద్రంపాలెం, మధురవాడ అప్ బ్రిడ్జి, నగరంపాలెం రోడ్డు జంక్షన్, మధురవాడ డైలీ మార్కెట్, శివశక్తినగర్ రోడ్డు జంక్షన్, కొమ్మాది జంక్షన్ ఇలా అన్ని ప్రాంతాలతో ఇదే పరిస్థితి నిత్యం దర్శనమిస్తోంది. దీంతో ఫుట్‌పాత్‌పై కాలు పెట్టడానికి కూడా అవకాశం ఉండడంలేదు. ఇలా తరచూ జరుగుతున్నా జీవీఎంసీ అధికారులు గానీ, ట్రాఫిక్ పోలీసులు గానీ పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులైనా దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

సెయిల్‌లో విలీనంతోనే స్టీల్‌ప్లాంట్‌కు భవిత



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న రాంబాబు,మాజీ కార్పొరేటర్ ఈశ్వరమ్మ

సీతమ్మధార: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పూర్తిగా మనుగడ సాధించాలంటే సెయిల్‌లో విలీనం చేయాలని గాజువాక జోన్ సీపీఎం కార్యదర్శి ఎం.రాంబాబు,మాజీ కార్పొరేటర్ బొట్ట ఈశ్వరమ్మ డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అఖిలపక్ష ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం పార్కులో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష 1,389 రోజు కొనసాగింది. ఈసందర్భంగా రాంబాబు, ఈశ్వరమ్మ మాట్లాడుతూ ఆర్థిక ప్యాకేజీ స్టీల్ ప్లాంట్ కొంతమేర ఆర్థిక సమస్యల నుంచి బయటపడడానికి తాత్కాలిక ఉపశమనంగా ఉంటుందన్నారు. ఈ ప్యాకేజీ శాశ్వతమైన పరిష్కారం కాదని వారు చెప్పారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే, సొంత గనులు కేటాయించాల్సిందేనని డిమాండ్ చేశారు సెయిల్‌లో విలీనం చేయడం ద్వారానే విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ బలమైన సంస్థగా ఎదుగుతుందని చెప్పారు. దీనిపైన కూడా కేంద్రం ఎటువంటి నిర్ణయం ప్రకటించలేదన్నారు. ఆర్థిక ప్యాకేజీ ఏ రూపంలో ఇస్తున్నారో స్పష్టం చేయలేదని తెలిపారు. పూర్తిస్థాయిలో ఉద్యోగులను నియమించాలని.. అవసరమైన వసతులు కల్పించి పూర్తిస్థాయిలో ఉత్పత్తి సాధించడానికి సహకరించాలని డిమాండ్ చేశారు. రిలేనిరాహార దీక్షలో గొలగాని అప్పారావు, ఎ. నూకేశ్వరరావు, భానుమూర్తి, ఆనంద్ పాల్గొన్నారు.

త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం



అప్పన్నను సత్కరిస్తున్న ఆరాధన ట్రస్ట్ ప్రతినిధులు

మద్దిలపాలెం: త్యాగరాజ స్వామి ఆరాధన ఉత్సవాలు మద్దిలపాలెం కళాభారతిలో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు కార్యక్రమాన్ని తమిళనాడు మ్యూజిక్ అండ్ డ్యాన్స్ యూనివర్సిటీ విశ్రాంత ఉపకులపతి డాక్టర్ వీణ గాయత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. త్యాగరాజ ఉత్సవాలు అత్యంత వైభవంగా ఏడు రోజుల పాటు చేయడం గొప్ప విషయం అన్నారు. కళాకారులు యూఎస్ఏ, కెనడా వంటి దూర ప్రదేశాల నుంచి వచ్చి పాల్గొనడం గొప్ప విషయమన్నారు. ఆరాధన ట్రస్ట్ అధ్యక్షుడు మంతెన సత్యనారాయణరాజు మాట్లాడుతూ సంగీతాన్ని ప్రోత్సహించడం, మన కళలను కాపాడడం కోసమే కళాభారతి త్యాగరాజ ఆరాధన ట్రస్టు కంకణం కట్టుకుందన్నారు. ఉత్సవాల్లో 1100 మంది కళాకారులు ఏడు రోజుల పాటు పాల్గొనున్నారన్నారు. కార్యదర్శి శ్రీరామదాసు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు ఒక సంస్థ 29 ఏళ్లుగా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

బిరుదు ప్రదానం: త్యాగరాజ ఆరాధన ట్రస్టు ప్రతిష్టాత్మకంగా ఏటా ఇచ్చే బిరుదు 'సంగీత కళాభారతి 2025 గాను ప్రముఖ నాదస్వర విద్వాంసులు గురువిళ్ల అప్పన్నకు ప్రదానం చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

పద్మనాభం: మండలంలోని మద్దిలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు దుర్మరణం చెందారు. పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఈ గ్రామానికి చెందిన జిత్తిక అప్పన్న (35) శుక్రవారం రాత్రి రోడ్డుపై నడిచి వెళ్తుండగా ముత్యాలమ్మ పుట్ట వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో అప్పన్నకు ముఖంపై బలమైన గాయాలవడంతో, అక్కడికక్కడే మృతి చెందారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. మృతుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు భార్య ఉంది.